క్లుప్తంగా

ఫ్రైడే డ్రైడే అమలు తీరు పరిశీలన



డెంగ్యూ బాధితులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా విభాగం అధికారి తులసి

డాబాగార్డెన్స్ : జిల్లా మలేరియా విభాగం అధికారి తులసి శనివారం జబ్బరితోట యూపీహెచ్‌సీ పరిధిలోని కోడిపందాల వీధిలో పర్యటించి ఫ్రైడే డ్రైడే అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ మలేరియా విభాగం ఏర్పాటు చేసిన లార్వా ప్రదర్శనను తిలకించారు. డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న పేషెంట్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని కనుక్కున్నారు. దోమల నియంత్రణకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, మలేరియా సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక విగ్రహ ప్రతిష్టకు రాట మహోత్సవం

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి రామాలయం వద్ద వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో వినాయచవితి మహోత్సవాలకు శనివారం రాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం నాయకులు అక్కరమాని వెంకటరావు, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇంటర్ విద్యార్థినికి ఆర్థిక సాయం



పద్మజకు చెక్కు అందజేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: క్షత్రియ యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని పూసపాటి పద్మజ సహస్రకు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. బాలయ్యశాస్త్రి లేవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థినికి చెక్కు అందజేశారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, క్షత్రియ యూత్ వింగ్ ప్రెసిడెంట్ జి.పృథ్వీరాజు, సెక్రటరీ జి.శ్రవణ్ వర్మ, కోశాధికారి వి.అభివర్మ, కిరణ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

SUNDAY SPECIAL

కలెక్షన్ కింగ్

కొందరికి సేవ చేయాలనే తపన.. మరికొందరికి కళల్లో రాణించాలనే అభిలాష.. ఇంకొందరికి క్రీడల పట్ల మక్కువ.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో రంగంలో రాణించాలనుకుంటారు. రవిశంకర్‌రెడ్డి వివిధ దేశాల కాయిన్స్, స్టాంపుల సేకరణ అంటే ఆసక్తి చూపుతారు. దశాబ్దాల కిందటి బైక్‌లు.. పాతకాలం నాటి ఏడు రకాల సైకిళ్లను తన ఇంట్లో మ్యూజియంగా ఏర్పాటు చేసుకున్నారు.

- పురాతన నాణాలు, స్టాంపుల సేకరణలో దిట్ట రవిశంకర్‌రెడ్డి
- తన సేకరణతో నాటి ప్రపంచం కళ్లకు కడుతుందంటూ ధీమా



ట్రూ ఫ్రెండ్స్ పేరిట ముంబై మింట్ విడుదల చేసిన కలర్ కాయిన్



రవిశంకర్‌రెడ్డి తన ఇంట్లో ఏర్పాటు చేసుకున్న వంశవృక్షం

డాబాగార్డెన్స్ : నాణాలు.. పాత వాహనాలు.. పలు దేశాల స్టాంపులు, పురాతన కార్లను సేకరిస్తూ అభిరుచి చాటుతున్నారు రవిశంకర్‌రెడ్డి. ఏడు తరాల వృక్షమంటూ ఒక వర్ణచిత్రాన్ని రూపొందింపజేసి కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి తగిలించారు. సాధారణంగా నాన్న.. తాత.. ముత్తాత వరకు ఎవరికైనా తెలుస్తుంది. కానీ ఏడు తరాల వారి పేర్లతో ఏర్పాటు చేసిన వంశవృక్ష చిత్రాన్ని తన ఇంటికి ఏర్పాటు చేసుకున్నారు. పురాతన చరిత్ర.. అప్పటి సంప్రదాయాలను స్టాంపులు, భిన్నరకాల వస్తువులు తెలియజేస్తాయని రవిశంకర్‌రెడ్డి చెబుతుంటారు. విద్యార్థులు.. భావితరాలకు అవి స్ఫూర్తిగా నిలుస్తాయంటున్నారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన రవిశంకర్‌రెడ్డి విదేశీ కాయిన్స్, కరెన్సీతో పాటు పురాతన వస్తువులను సేకరించటంలో దిట్ట. 1957 నుంచి భారతదేశంలో వాడే ద్విచక్ర వాహనాలు ఆయన వద్ద ఉన్నాయి. అరుదైన భారతీయ నాణాలు, నోట్లను సేకరించడమే కాక, 122 దేశాల విదేశీ కరెన్సీ, డాలర్లు, 67 దేశాల స్టాంపులు సేకరించారు.

కాయిన్స్ ఇలా..

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కోల్‌కతా మింట్ విడుదల చేసిన రూ.50 మొదటి కాయిన్‌ను 2018లో రవిశంకర్‌రెడ్డి రూ.3580కు పొందారు. ఆ తర్వాత రూ.500 కాయిన్‌ను సాధించారు. నాలుగేళ్ల కిందట రూ.200 నాణెం సేకరించారు. మూడేళ్ల కిందట రూ.1000 నాణెం సొంతం చేసుకున్నారు. గతంలో రూ.10, రూ.20, రూ.100, రూ.150 వంటి కాయిన్లు సేకరించారు. ఏడాది కిందట రూ.75, రూ.350, రూ.550 నాణాలు సేకరించిన రవిశంకర్‌రెడ్డి, రాజ్యసభ 250వ సమావేశాన్ని పురస్కరించుకుని ముంబై మింట్ ఎనిమిది నెల కిందట విడుదల చేసిన రూ.250 కాయిన్‌ను కూడా సొంతం చేసుకున్నారు.

ఇటీవల కలెక్షన్లు..

గురుతేగ్ బహదూర్ 400వ జయంతి సందర్భంగా ముంబై మింట్ విడుదల చేసిన రూ.400 కాయిన్‌ను రవిశంకర్‌రెడ్డి రూ.4429కి చేజిక్కించుకున్నారు. అలాగే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభించి 175 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ముంబై మింట్ ఇటీవల విడుదల చేసిన రూ.175 కాయిన్‌ను రూ.3,580కి కొనుగోలు చేసి విశాఖలో అరుదైన కాయిన్లు.. కరెన్సీ సేకరణలో కలెక్షన్ కింగ్‌గా నిలిచారు. అలాగే నూతనంగా ముంబై మింట్, కోల్‌కతా మింట్ చిన్నారుల నీతి కథలకు సంబంధించి పంచతంత్రంలో భాగంగా ఇటీవల విడుదల చేసిన 2 కలర్ కాయిన్స్, కోల్‌కతా మింట్ విడుదల చేసిన ఒక డాలర్ కాయిన్‌ను రవిశంకర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. మంకీ అండ్ క్రొకొడైల్, ట్రూ ఫ్రెండ్స్ పేరిట ముంబై మింట్, క్రో అండ్ స్నేక్ పేరిట మంచి సందేశాత్మకాన్నిచ్చే కోల్‌కతా మింట్ విడుదల చేసిన కలర్ కాయిన్స్‌ను సొంతం చేసుకుని విశాఖ చరిత్రలో తొలి వ్యక్తిగా నిలిచారు.



మంకీ అండ్ క్రొకడెయిల్ పేరిట ముంబై మింట్ విడుదల చేసిన కలర్ కాయిన్



రూ.400 కాయిన్



రూ.175 కాయిన్



క్రో అండ్ స్నేక్ కలర్ కాయిన్

చరిత్రను చాటి చెప్పాలనే..



పాత కాలం వస్తువులు.. పాత కరెన్సీ సేకరించడం చిన్నప్పటి నుంచి నా హాబీ. పైసా నుంచి ఐదు రూపాయలు, పది రూపాయలతో పాటు కోల్‌కతా.. ముంబై మింట్ వివిధ సందర్భాల్లో విడుదల చేసిన ఎన్నో కాయిన్స్‌ను సేకరించాను. మా ఇంటి నిండా 1957 నుంచి భారతదేశంలో వాడే ద్విచక్ర వాహనాలు, అరుదైన భారతీయ నాణాలు, నోట్లు ఉన్నాయి. 122 దేశాల విదేశీ కరెన్సీ, డాలర్లతో పాటు 67 దేశాల స్టాంపులు సేకరించాను. మన చరిత్రతో పాటు ప్రపంచ చరిత్రను కూడా తెలియజేసేలా నా సేకరణ ఉండాలని, విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలనేది నా కోరిక.

– రవిశంకర్‌రెడ్డి, కాయిన్స్ కలెక్షన్ కింగ్, అడ్వెంచర్ స్పోర్ట్స్‌మేన్.

నేడు చిత్రకళా ప్రదర్శన.. చిత్రలేఖనం పోటీలు

డాబాగార్డెన్స్ : కళని, కళా సంస్కృతిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కళాయజ్ఞ–జీవన రేఖలు ఏకవర్ణ చిత్రకళా ప్రదర్శన ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవనరేఖలు చిత్రకళా ప్రదర్శన ఉదయం 10 గంటలకు ఏయూ ఫైన్‌ఆర్ట్స్‌లో ప్రొఫెసర్ శిష్టా శ్రీనివాస్ ప్రారంభించనున్నారని, అలాగే మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఒకటి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న పిల్లలకు ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

చిత్రకళా ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు, ఆర్ట్ కాంటెస్ట్‌లో గెలుపొందిన విజేతలకు సాయంత్రం 4.30 గంటలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు.

ఐఏసీఈ సంస్థ శిక్షణతో ప్రభుత్వ ఉద్యోగాలు



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాసరావు

సీతమ్మధార : ఐఏసీఈ సంస్థ ద్వారా శిక్షణ పొందిన ఎంతో మంది బ్యాంకు, రైల్వే, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ద్వారకానగర్‌లోని సంస్థ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నామమాత్రపు ఫీజుతో ఉద్యోగం వచ్చే వరకు చక్కటి ఇస్తున్నామని తెలిపారు. ఐఏసీఈలో చేరిన విద్యార్థి ఒక్కసారి ఫీజు చెల్లిస్తే ఉద్యోగం వచ్చే వరకు క్వాలిటీతో కూడిన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కోలా గురువులుకు ఎమ్మెల్యే అభినందనలు



కోలా గురువులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : డీసీసీబీ చైర్మన్‌గా కోలా గురువులు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికి గౌరవం దక్కుతుందన్నారు. మత్స్యకారులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. 16 ఫిషింగ్ హార్బర్లు, 4 పోర్టులు నిర్మించటమే కాకుండా 11 ఫిషింగ్ స్టేషన్లు, చేపలవేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచి ఆ విషయం సీఎం నిరూపించారన్నారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీ చైర్మన్, విశాఖ, అనకాపల్లి, అరకు, పాడేరు, విజయనగరం జిల్లాల వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పులులు, పర్యావరణంపై చిత్రలేఖన పోటీలు



తాము వేసిన బొమ్మలతో పిల్లలు

ఆరిలోవ: అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా శనివారం జూ ఎడ్యుకేషనల్ విభాగం సిబ్బంది డెయిరీఫారం దరి ఇందిరానగర్‌లో ఆనంద్‌మార్గ్ ఆశ్రమం పిల్లలకు చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. పులులు, పర్యావరణంపై నిర్వహించిన పోటీల్లో పిల్లలు ప్రతిభ కనబరిచారు. అనంతరం జూ సిబ్బంది వారికి పులులు, పర్యావరణంపై అవగాహన కలిగించారు. ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవధూత, జూ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయండి



గోపికృష్ణను అభినందిస్తున్న మన్యాల శ్రీను, నారాయణరెడ్డి తదితరులు

అల్లిపురం : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా అధిష్టానం ఎవరిని నిలిపినా, పార్టీ విజయానికి కలిసి కట్టుగా పని చేయాలని 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బంగారుమెట్ట సచివాలయంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొని మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు అందరూ కష్టపడాలన్నారు. రాష్ట్రంలో లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వలంటీర్ వ్యవస్థను రూపొందించారన్నారు. వారు లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నారని తెలిపారు. అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులకు తెల్లారేసరికి పెన్షన్లు అందజేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు గోపికృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్మలు, ఆడారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, కణితి బ్రహ్మం, పిల్లి శివ, మేడం నారాయణరెడ్డి, బొగ్గ శ్యామ్, బొండాడ వెంకటరావు, వాణి లాడ్డి శ్రీను, జె. ప్రకాష్, ట్రస్టీ కళ, ప్రసాద్‌రెడ్డి, సంతోష్, హరి తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరిపై మండిపడ్డ అఖిలపక్షం



సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

డాబాగార్డెన్స్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. ఆమె మాటలు వింటుంటే తెలుగు రాష్ట్ర ప్రజల కోసం కాకుండా.. కేంద్రంలోని బీజేపీకి తొత్తుగా మారినట్టు ఉన్నాయని ఎద్దేవా చేశారు. విశాఖ ఎంపీగా.. కేంద్ర మంత్రిగా పని చేసి విశాఖకు, ఆంధ్ర రాష్ట్రానికి ఏమీ చేయకపోగా.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీ పంచన చేరి, ఆ పార్టీకి అనుకూలంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు బీజేపీపై తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను ఏ ఒక్కటీ పూర్తి చేయకుండానే తప్పుడు ప్రచారానికి బీజేపీ నూతన అధ్యక్షురాలు పూనుకున్నారని ఎద్దేవా చేశారు. తాజాగా అదానీతో బీజేపీ సర్కారు కుమ్మక్కై స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తుందని ఆరోపించారు. బీజేపీ ఇప్పటికైనా కపట నాటకాలు, అబద్ధాలు ఆపి విశాఖ రైల్వేజోన్ నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అటవీహక్కుల సంరక్షణ చట్టంలో సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించినా, లెక్క చేయకుండా బీజేపీ ఆమోదింపజేసిందన్నారు. దీంతో ఉత్తరాంధ్ర గిరిజనులు తీవ్ర ప్రమాదంలో పడ్డారని తెలిపారు. ఐదేళ్లలో రైల్వే జోన్‌కి ఎంత ఖర్చు పెట్టారు? ఎంత అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా? అంటూ పురందేశ్వరికి బహిరంగ సవాల్ విసిరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డాక్టర్ బి. గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకుడు వై. కొండయ్య, కె. శంకరరావు, కె. దేవ, ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భూ పరిమాణం చిన్నదవుతోంది



భూ పరిమాణంపై రూపొందించిన చిత్రాలు చూపుతున్న శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్ : వాతావరణంలో వస్తున్న మార్పులు.. ముడి చమురు రీసైకిల్ కాకపోవడంతో భూమి పరిమాణం చిన్నదవుతోందని నగర వాసి బి. శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై శాస్త్రవేత్తలు ఏకీభవించరని, కానీ రానున్న రోజుల్లో పెను ప్రమాదం పొంచి ఉందని, మానవాళి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి పరిమాణం చిన్నదవుతుందనే విషయంపై తాను తీసిన డాక్యుమెంటరీ త్వరలోనే విడుదల చేయనున్నట్టు చెప్పారు. ముందుగా మేల్కొనకపోతే 2030 నుంచి మానవాళికి ప్రమాదం పొంచి ఉందని, 2060 నాటికి మానవజాతి లేకుండా పోయే అవకాశం ఉందన్నారు. శరవేగంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు ముడి చమురు వినియోగించకుండా బ్యాటరీ వాహనాలు వినియోగించుకోవాలని అన్నారు. సమావేశంలో జి. శివకుమార్ పాల్గొన్నారు.

1 నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో 159వ దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. శనివారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్ద కిందట జ్ఞానాపురంలో కలరా వ్యాధితో అనేక మంది ప్రజలు మృత్యువాత పడ్డారన్నారు. బిషప్ పీటర్ రోస్సియోస్ సూచన ప్రకారం ఆలయ విచారణ కర్తలు దేవమాత (మరియమాత) స్వరూపం జ్ఞానాపురంలో నేలకొల్పి పురవీధుల్లో తేరును ఊరేగింపు చేస్తే పరిస్థితులు అదుపులోకి వస్తాయన్నారని తెలిపారు. నాటి నుంచి ఆ కార్యక్రమం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆగస్టు 1 సాయంత్రం స్లీప్‌గుర్తు మండపంలో పతాకావిష్కరణ అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. 15న జరిగే ప్రధాన మహోత్సవాలను విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ, పుర:ప్రదక్షిణ, బహుమతి ప్రదానం, భారీ బాణసంచాతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. అనంతరం పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. ఫాదర్లు పి. ప్రభాకర్, వేళంగిణీరావు, పీపీసీ అధ్యక్షుడు వై.అమర్‌దీప్, ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి చార్లీ, కార్యదర్శి పి.ఆనందరావు, కోశాధికారి జి.ఆనందరావు, గురు మండలి సలహా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఈట్ రైట్ మేళా'

- ఆకట్టుకున్న మిల్లెట్ స్టాల్స్



స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎండీ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈట్ రైట్ మిల్లెట్ మేళాకు విశేష స్పందన లభించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ), స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా ఉక్కు మల్టీపర్పస్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అరుల్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ భట్ మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న ఆరోగ్య స్పృహతో చిరు ధాన్యాలకు డిమాండ్ పెరిగిందన్నారు. దైనందిన జీవితంలో మిల్లెట్స్ వినియోగం, ప్రాధాన్యం గురించి డాక్టర్ అరుల్ ఆనంద్, సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజిమెంట్ అకాడమీ ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి, క్యూ1 ఇంటర్నేషనల్ ఫుడ్స్ సీఈఓ ఎస్. సుజాత శ్రీనివాస్, విశాఖ డెయిరీ ఎండీ ఎస్.వి.రమణ, శ్రావణ్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జి. సాంబశివరావు తదితరులు వివరించారు. మేళాలో సృష్టి వరల్డ్ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన మిల్లెట్లు, మిలెట్లతో చేసిన వంటకాలను సీఎండీ అతుల్‌భట్ అభినందించారు.

ఉక్కు సెక్టార్లలో 'వాకథాన్'

ఈట్ రైట్ ఇండియా – 'సురక్షితంగా తినండి– ఆరోగ్యంగా తినండి– స్థిరంగా తినండి' నినాదంతో ఉక్కునగరంలో శనివారం ఉదయం నిర్వహించిన వాకథాన్ ఉత్సాహంగా సాగింది. ముందుగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి, డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు. సెక్టార్– 5 నుంచి సెక్టార్–1 మీదుగా అంబేడ్కర్ కళాక్షేత్రం గుండా సెక్టార్–6 వరకు వాకథాన్ సాగింది. అంతకు ముందు క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ బహుమతులు అందజేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. బీపీ, సుగర్ టెస్ట్‌లు చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.